నమస్తే తెలంగాణ
జిందగీ



# సక్సెస్‌ఫుల్ ఫెయిల్యూర్స్

**సినిమా అంటే.. హీరో! ఆ కథానాయకుడికి ఫస్టాఫ్ అంతా కష్టాలే రావాలి! సెకండాఫ్‌లో వాటన్నిటినీ అతగాడు జయించాలి. తురుంఖాన్ అనిపించుకోవాలి. అదే సినిమా సక్సెస్ ఫార్ములా అని అందరూ భావిస్తారు. హీరోయిజం థియేటర్ బయటి కటౌట్ కన్నా భారీగా ఉంటేనే అభిమానులకు పండుగ! అదే హీరో పరిస్థితులకు తలొగ్గితే, విధి వలయంలో చిక్కుకుంటే, విఫలుడై మిగిలిపోతే.. ఫ్యాన్స్ ఉస్సూరుమంటారు! బాక్సాఫీస్ బేరుమంటుంది! వెరసి సినిమా అట్టర్ ఫ్లాప్ అన్న అపకీర్తి మూటగట్టుకుంటుంది. కానీ, కొన్ని సినిమాలు ఈ ఫార్ములాలో ఇమడవు. హీరో ఫెయిల్ అయినా.. సక్సెస్ అయిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి..**



**ఫెయిల్యూర్** స్టోరీ అనగానే విషాదాంతం అనుకుంటాం! ముగింపును ప్రేక్షకుడు జీర్ణించుకోలేకపోయినా.. ఎందుకో ఆ సినిమాకు కనెక్ట్ అవుతాడు. ఫెయిల్యూర్ స్టోరీకి నిర్వచనం ప్రత్యేకంగా ఏదీ లేదు! హీరో తన లక్ష్యాన్ని అందుకోలేకపోవడమే ఫెయిల్యూర్ కథ కమామిషు అని కొందరి అభిప్రాయం. ఈ క్రమంలో హీరో పాత్రతో త్యాగం చేయించి సెంటిమెంట్ పండించిన దర్శకులు ఎందరో!

'అంతులేని కథ', 'ఇది కథ కాదు' తరహా బాలచందర్ చిత్రాలు కూడా ఫెయిల్యూర్ సినిమా కోవలోకే వస్తాయి. ముగింపులేని కథల జాబితాలోనూ అవి చోటు దక్కించుకున్నాయి. అక్కినేని 'ప్రేమాభిషేకం' నుంచి నిన్నమొన్న వచ్చిన 'సీతారామం' వరకు విఫల ప్రేమను బాక్సాఫీస్ దగ్గర సఫలం చేసిన కథలెన్నో!

### బాధే సౌఖ్యం.. విజయం!

అసలు సిసలు ఫెయిల్యూర్ స్టోరీతో వెండితెరపై కాసులు కురిపించిన చిత్రరాజం దేవదాసు. బెంగాలీ బాబు శరత్‌చంద్ర రాసిన 'దేవదాసు' విఫల గాథ. ఈ నవల ఆధారంగా వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 1953లో విడుదలైన అక్కినేని 'దేవదాసు' అపురూప చిత్రంగా నీరాజనాలు అందుకుంది. లైలామజ్ను, సలీం–అనార్కలీ జీవితాలు విఫల ప్రేమకు తార్కాణాలు! కానీ, ఈ చారిత్రక జంటల సరసన నిలిచిన నవలా పాత్రలు దేవదాసు–పార్వతి. సినిమాగా రూపుదిద్దుకోక ముందే.. దేవదాసు భగ్న ప్రేమికుడని ప్రపంచానికి తెలుసు. పారూను అమితంగా ప్రేమించిన దేవదా పెద్దల పెత్తనానికి తలొగ్గి తన ఉద్దేశాన్ని మార్చుకుంటాడు. రాత్రికి రాత్రి వచ్చి తనను పెండ్లి చేసుకోమని పార్వతి బతిమాలినా.. అసాధ్యం అనేస్తాడు! అక్కడితోనే ఆగలేదు దేవదాసు వైఫల్యం. ప్రేమించిన పడతిని మర్చిపోలేక.. తాగుడుకు బానిసవుతాడు. ద్వితీయార్ధం అంతా తూలుతూనే ఉంటాడు. చివరికి విఫల ప్రేమికుడిగా.. తనువు చాలిస్తాడు! అయితేనేం, దేవదాసు సక్సెస్ అయ్యాడు. ఎన్ని భాషల్లో, ఎన్నిసార్లు వచ్చినా నిర్మాతకు కాసులపంట పండించాడు. ప్రేక్షకుల చేత కంటతడి పెట్టిస్తూనే... సూపర్ హిట్ అయ్యాడు. 'బాధే సౌఖ్యమనే భావన' కల్పించి భగ్న ప్రేమికుల పాలిట దేవుడయ్యాడు ఈ దేవదాసు!

### అలా తీయాల్సింది కాదేమో!

బాలచందర్ ఎంతో ఇదిగా తీసి, తర్వాత ఎందుకిలా తీశానా అని వగచిన సినిమా 'మరోచరిత్ర'. 1978లో వచ్చిన ఈ



సినిమా ఓ సంచలనం. కమల్‌హాసన్, సరిత.. బాలు, స్వప్నగా నటించారు. వీరి ప్రభావం ఎంత ఉందంటే.. ఆ తర్వాత వచ్చిన చాలా సినిమాల్లో హీరోహీరోయిన్ల పేర్ల కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పోయింది! అయితే, చూసే దాకా 'మరోచరిత్ర' విషాదాంతం అని ఎవరికీ తెలియదు. క్లైమాక్స్‌లోనే కాదు.. కథాగమనంలోనూ కొన్ని ఫెయిల్యూర్స్ చోటు చేసుకుంటాయి. చిక్కగా ప్రేమించుకున్న జంట.. చక్కగా కలిసిపోకుండా పెద్దలు అడ్డుపడతారు! ఇది సినిమాల్లో చాలా కామన్! పందెం కాసి ప్రేయసికి దూరమైన ప్రియుడు చాలాకాలం కుదురుగానే ఉంటాడు. ఓ బలహీన క్షణంలో పట్టుతప్పే దాకా వెళ్తాడు. మళ్లీ పట్టాలెక్కుతాడు. కాల పరిమితి ముగిశాక.. తన స్వప్నను కలుసుకోవడానికి ఆగమేఘాల మీద వస్తాడు. కానీ, 'విధి చేయు వింతలన్ని మతిలేని చేతలేనని..' అని ఆత్రేయ అన్నట్టు.. ఆ విధి వలయంలో ఇద్దరూ విఫలురుగా మిగిలిపోతారు. బలవన్మరణానికి పాల్పడతారు. విషాదాంతంగా ముగిసిన ఈ ఫెయిల్యూర్ స్టోరీ... బాక్సాఫీస్ దగ్గర బిగ్ సక్సెస్ సాధించింది. అంతేకాదు, తరాలు మారినా.. ఇప్పటికీ 'మరోచరిత్ర' గొప్ప చిత్రంగా చరిత్రలో నిలిచిపోయింది. ఈ సినిమా విడుదలయ్యాక కొన్నాళ్లపాటు చెన్నై మెరీనా బీచ్‌లో వారానికి ఒకటిరెండు ప్రేమ జంటలు ఆత్మహత్యకు పాల్పడ్డాయట. ఆ వార్తలు విని బాలచందర్.. బాలు, స్వప్నను బతికించి ఉంటే, ఈ వార్తలు వచ్చేవి కావేమో అనుకున్నారట.

### నాద వినోదం.. తుదకు విషాదం..

కళాతపస్వి కె.విశ్వనాథ్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో వచ్చిన అద్భుత చిత్రం 'సాగర సంగమం'. ఈ సినిమా ఫస్ట్ షాట్‌లోనే ఓ తాగుబోతు, అరిగిన చెప్పులను జేబులో దోపుకొన్న వాడు.. అలా వస్తుంటాడు. విధికి తలొగ్గి వేదనగా మిగిలిన ఓ ఫెయిల్యూర్ పర్సన్ స్టోరీ ఇది అని దర్శకుడు విశ్వనాథ్ మొదటి సీన్‌లోనే చూపించేశాడు. కానీ, ఆ విఫల కళాకారుడు, ప్రేమికుడు అయిన బాలు కథను రెండున్నర గంటలపాటు ప్రేక్షకులు కన్నార్పకుండా చూశారు. అతగాడు 'వేవేల గోపెమ్మలా..' అని మనసు చంపుకొని నృత్యం కంపోజ్ చేస్తుంటే మనమూ బాధపడ్డాం. 'భంగిమ' అంటూ ట్రైనీ ఫొటోగ్రాఫర్ అతణ్ని ఆటపట్టిస్తే నవ్వుకున్నాం. మరపురాని రేయిలో 'మౌనమేలనోయి.. ' అని కథానాయికను వినమ్రంగా అనునయిస్తుంటే కరిగిపోయాం. తాను ఆరాధించిన వ్యక్తిని, ఆమెను కట్టుకున్న వాడి చేతిలో పెట్టినప్పుడు పొంగిపోయాం. కానీ, ఆ తర్వాత అతని జీవితమే మారిపోతుందని ఎవరూ ఊహించరు. మళ్లీ ఇరవై ఏండ్లకు ఇదిగో కళాకారుడు బాలు తాగుబోతు బాలుగా కనిపిస్తాడు! నూతి మీద తకిట తధిమి అని గంతులేస్తుంటే.. మనమే ఆ నుయ్యిలో పడిపోతామా అన్నంత భయపడ్డాం!! తన లక్ష్యాన్ని మరచిన నృత్య కళాకారుడు.. ఓ శిష్యురాలి ఛీత్కారాలను భరించిన వైనం కంటతడి పెట్టిస్తుంది. చివరికి తనకంటూ ఏదీ లేకుండా నటరాజ పాదాల చెంత తలవాల్చిన బాలును చూసి భారంగా నిట్టూర్పు విడుస్తాం. ఇంతకన్నా గొప్ప ఫెయిల్యూర్ స్టోరీ మరొకటి ఉండదేమో! అలాంటి కథతో ఇంతటి హిట్ సాధించిన సినిమా కూడా ఇదేనేమో!

### విజేత వైఫల్యం

అవకాశం వచ్చినప్పుడల్లా ప్రయోగాత్మక చిత్రాలు చేయడంలో హీరో నాని ముందుంటాడు. అలా ఆయన చేసిన సినిమానే 'జెర్సీ'. కొడుక్కు రూ.500తో ఓ జెర్సీ కొనివ్వలేని తండ్రి కథ ఇది. భార్య ఇచ్చే డబ్బులపై బతుకు వెళ్లదీసే ఓ భర్త కథ ఇది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఇందులో క్రికెటర్ అవ్వాలన్న హీరో కోరిక నెరవేరదు. పైగా అనుకోని పరిస్థితుల్లో ఆటకు దూరమవుతాడు. చేస్తున్న ఉద్యోగం ఊడిపోతుంది. వీటికి తోడు స్మోకింగ్, డ్రింకింగ్ హ్యాబిట్స్! ఇన్ని వైఫల్యాలు మూటగట్టుకున్న హీరో.. ఓసారి బ్యాటు పట్టుకుంటాడు. ఆ మ్యాచ్‌లో అతను రాణిస్తే... ఇండియా జట్టుకు ఎంపిక కావడం ఖాయం. అద్భుతంగా రాణిస్తాడు. కానీ, ఆ గెలుపు పిలుపు చెవిన పడకముందే.. తనువు చాలిస్తాడు. పైకి ఫెయిల్యూర్‌గా కనిపించిన జెర్సీ హీరో పాత్ర అర్జున్ (నాని) ఎంత సక్సెస్ సాధించాడో మరో ఇరవై ఏండ్లకు ప్రపంచానికి తెలుస్తుంది. ఇంగ్లండ్ టూర్‌కు సెలెక్ట్ చేసిన ఇండియా జట్టులో అర్జున్ పేరుందని లోకానికి తెలుస్తుంది. ఓ విఫల ఆటగాడి ఆటోబయోగ్రఫీ ఎందుకు రాయాల్సి వచ్చిందో.. ఆ క్లైమాక్స్ చూస్తే గానీ అర్థం కాదు! మొత్తానికి ఫెయిల్యూర్ కథతో రూపుదిద్దుకున్న 'జెర్సీ' సూపర్‌హిట్ టాక్ అందుకుంది.

# డబ్బాల్లో డ్రగ్స్!

**డబ్బా కార్టెల్**

**నెట్‌ఫ్లిక్స్ :** ఫిబ్రవరి 28, 2025
**తారాగణం :** షబానా అజ్మీ, జ్యోతిక, శాలినీ పాండే, నిమిషా సజయన్, అంజలి ఆనంద్, జిషుసేన్ గుప్త తదితరులు
**దర్శకత్వం :** హితేశ్ భాటియా

**క్రైమ్** థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కే కథలది మినిమం గ్యారెంటీ! అందులోనూ డ్రగ్స్ బ్యాక్‌డ్రాప్ కూడా ఉందంటే.. హిట్ అవ్వాల్సిందే! అలాంటి కథతోనే వచ్చిన సరికొత్త వెబ్ సిరీస్.. డబ్బా కార్టెల్. నెటిఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కి వచ్చి.. హిట్ టాక్ తెచ్చుకున్నది. ఉత్తరాది – దక్షిణాదికి చెందిన పలువురు లేడి స్టార్స్ కీలక పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్ కథ ముంబై నేపథ్యంలో సాగుతుంది. ఓ ఫార్మా కంపెనీ తయారుచేసిన డ్రగ్స్ వల్ల కొన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ డ్రగ్స్‌కు అనుమతి లేకపోవడంతో అసలు విషయాన్ని బయటపెట్టేందుకు ఫుడ్ అండ్ డ్రగ్స్ అధికారి పాఠక్(గజరాజ్ రావు) ఇన్వెస్టిగేషన్ మొదలుపెడతాడు. మరోవైపు రాజి (శాలినీ పాండే) భర్త ఫార్మా కంపెనీలో ఉద్యోగి. తనకు జర్మనీ వెళ్లి.. అక్కడే స్థిరపడాలని కోరిక. అందుకు సరిపడా డబ్బు సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు. ఇటు భర్తకు సాయపడాలని 'లంచ్ బాక్స్' పేరిట వ్యాపారం చేస్తుంటుంది రాజి. మాల (నిమిషా సజయన్) రాజికి అసిస్టెంట్. పెద్దగా చదువుకోని మాలకు.. కనీసం తన బిడ్డనైనా ఉన్నతంగా చదివించాలనీ, సమాజంలో గౌరవం పొందాలని ఆశగా ఉంటుంది. అయితే, మాలా బాయ్‌ఫ్రెండ్ సంతోష్.. ప్రైవేట్ వీడియోలు తీసి ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తుంటాడు. లంచ్ బాక్సుల్లో ఆహారంతోపాటు గంజాయి సప్లయ్ చేయాలని ఆమెను బెదిరిస్తాడు. తప్పనిసరి పరిస్థితుల్లో మాల అందుకు ఒప్పుకొంటుంది. అయితే, గంజాయితోనే ఆగకుండా.. డ్రగ్స్ కూడా ఎందుకు సప్లయ్ చేయాల్సి వచ్చింది? ఇందులోకి దిగిన మాలకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ కథలో షీలా (షబానా అజ్మీ), వరుణ (జ్యోతిక) పాత్రలేంటి? తెలుసుకోవాలంటే.. వెబ్ సిరీస్ చూడాల్సిందే! మొత్తం ఏడు ఎపిసోడ్స్ ఉన్న ఈ సిరీస్.. చూస్తున్న కొద్దీ చూడాలనిపించేలా సాగిపోతుంది.



# కర్వా చౌత్ ఉండాల్సిందే!

**ఉత్తరాదిలో** పెద్ద పండుగైన 'కర్వా చౌత్' లేకుండా.. బాలీవుడ్‌లో కుటుంబ కథా చిత్రాన్ని తీయలేమని అంటున్నది 'మిసెస్' డైరెక్టర్ ఆరతి కడావ్. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. 'మిసెస్' చిత్రంలోని కర్వా చౌత్ సన్నివేశం గురించిన సంగతులను పంచుకున్నది. నిజానికి 'మిసెస్' మాతృక 'ద గ్రేట్ ఇండియన్ కిచెన్'.. కేరళ నేపథ్యంలో సాగుతుంది. అందులో దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు కనిపిస్తాయి. అయితే, ఆరతి ఈ సినిమాను రీమేక్ చేస్తున్నప్పుడు.. తాను పెరిగిన వాతావరణాన్ని, అక్కడి ఆచార వ్యవహారాలనూ చూపించాలని అనుకున్నదట. అప్పుడు.. 'కర్వా చౌత్‌ను చూపించకుండా బాలీవుడ్‌లో ఓ కుటుంబ కథా చిత్రాన్ని ఎలా తీయగలం?' అని తనకు తానే ప్రశ్నించుకున్నదట. వెంటనే.. ఈ పండుగను సినిమాలో భాగం చేసినట్టు వెల్లడించింది. షూటింగ్ ముగియడానికి కేవలం 20 రోజుల ముందు ఈ సన్నివేశాన్ని తీశారట. ఈ సందర్భంగా ఆరతి మాట్లాడుతూ.. ''సినిమాల్లో ఆచార వ్యవహారాలను చూపించడం నాకు ఇబ్బందిగా అనిపిస్తుంది. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని సన్నివేశాలను చూపించాల్సి వస్తుంది. అలాంటిదే.. ఈ కర్వా చౌత్ సన్నివేశం. నిజానికి ఈ సంప్రదాయాన్ని బాలీవుడ్ తనదిగా చేసుకుంది. ఎంతలా అంటే.. కొన్ని తరాలను ప్రభావితం చేసే స్థాయికి 'కర్వా చౌత్'ను తీసుకెళ్లింది'' అంటూ చెప్పుకొచ్చింది. 'మిసెస్' సినిమా చూసిన ప్రేక్షకులు ఒక్క క్షణమైనా తమ ఇంట్లో ఆడవాళ్లు పడే కష్టాన్ని గుర్తిస్తారనీ, ఆ లక్ష్యంతోనే ఈ సినిమా తీశామని చెబుతున్నది దర్శకురాలు ఆరతి కడావ్. ఇక 'మిసెస్' సినిమా విషయానికి వస్తే.. 2021లో విడుదలైన మలయాళ చిత్రం 'ద గ్రేట్ ఇండియన్ కిచెన్'కి హిందీ రీమేక్‌గా రూపొందింది. దంగల్ సినిమాతో దేశవ్యాప్తంగా పాపులారిటీని సంపాదించుకున్న 'సాన్యా మల్హోత్రా'.. ఇందులో ప్రధాన పాత్ర పోషించింది.



# భారత్ ఎంతో చేయగలదు..

**ప్రపంచానికి** ఏ రకమైన ఆపద వచ్చినా.. కాపాడే సత్తా భారత్‌కు ఉన్నదని చెబుతున్నాడు బాలీవుడ్ టాప్‌హీరో అక్షయ్ కుమార్. తాజాగా, ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్.. దేశభక్తి, సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించినప్పటి నుంచి.. దేశభక్తిని హైలైట్ చేస్తూ అనేక సినిమాలు తీశానని వెల్లడించాడు. ఈ తరహా చిత్రాలు హాలీవుడ్‌లోనూ అనేకం నిర్మించారనీ, ప్రపంచంలో ఏ మూల విషాదం ఉన్నా.. అమెరికన్లే నివారిస్తున్నట్టు అక్కడి సినిమాల్లో చూపిస్తున్నారని చెప్పుకొచ్చాడు. వాటి గురించి ఆలోచించడం వల్లే.. మనదేశం మరింత మెరుగ్గా ఉండగలదనే నిర్ణయానికి వచ్చాననీ, అందుకే దేశభక్తి సినిమాలను ఎక్కువగా తీసుకున్నానని అక్షయ్ కుమార్ తెలిపాడు. వీటిని చూసిన ప్రతిసారీ.. 'నువ్వు ఎన్నిసార్లు దేశాన్ని కాపాడతావు?' అంటూ తన భార్య ట్వింకిల్‌ఖన్నా తనను ఆట పట్టిస్తున్నదని అంటున్నాడు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ.. ''ప్రపంచానికి ఏదైనా పెద్ద ఇబ్బంది ఎదురైతే.. అంటే, ఉగ్రవాదుల దాడి, గ్రహాంతరవాసుల దాడి, ఆకాశం నుంచి పడిపోయే గ్రహశకలాలు.. ఇలాంటి ప్రమాదాలు ఎదురైతే.. అప్పుడు ఈ ప్రపంచాన్ని ఎవరు కాపాడతారు? హాలీవుడ్ సినిమాలు చూసేవాళ్లంతా 'అమెరికా' అనే అంటారు. మరి మనదేశం ఏమి చేయగలదో మనకు తెలియదా? భారతదేశం ఎంతో చేయగలదు. ప్రపంచానికి ఎలాంటి ఆపద ఎదురైనా కాపాడే శక్తి మన దేశానికి ఉన్నది'' అంటూ చెప్పుకొచ్చాడు. ఇక ఎయిర్ లిఫ్ట్, మిషన్ మంగళ్ వంటి చిత్రాలు.. ప్రత్యేకమైన భారతీయ కథలనీ, అవి పెద్దగా లాభాలు తెచ్చిపెట్టవని తెలిసినా తన హృదయం మాత్రం ఇలాంటి సినిమాలే చేయాలని చెబుతుందని వెల్లడించాడు. దేశం కోసం ఇలాంటి సినిమాలు తీస్తూనే ఉంటానని స్పష్టం చేశాడు.



# అదెప్పటికీ నా ఫేవరేటే

**'చురాలియా** హై తుమ్‌కో..' పాట ఎప్పటికీ తన 'ఫేవరేట్ సాంగ్'గానే ఉంటుందని చెబుతున్నది అలనాటి అందాల తార జీనత్ అమన్. ప్రపంచంలో ఎక్కడైనా, ఏ ఈవెంట్‌కు హాజరైనా.. ఈ పాట తప్పకుండా ప్లే అవుతుందని చెప్పుకొచ్చింది. తాజాగా, ఈ పాటతో ఉన్న అనుబంధాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నది జీనత్. 'యాదోంకీ బారాత్ సినిమా విడుదలైన తర్వాత.. 'చురాలియా' పాట ఓ సెన్సేషన్‌గా మారింది. ఎవర్‌గ్రీన్ హిట్ సాంగ్స్ లిస్ట్‌లో చేరింది. అయితే.. దీనికి నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే.. ఆ కాలానికి చెందిన లెజెండ్స్ అందరూ ఈ పాట కోసం పనిచేశారు. సంగీత దర్శకుడు.. ద గ్రేట్ ఆర్డీ బర్మన్. పాట రాసింది మజ్రూహ్ సుల్తాన్‌పురీ. ఇక లెజండరీ సింగర్స్ ఆశా భోంస్లే, మొహమ్మద్ రఫీ గొంతులు.. పాటను మరో స్థాయికి తీసుకెళ్లాయి' అంటూ రాసుకొచ్చింది. ఇక ఇందులో తన ఔట్‌ఫిట్ గురించి చెబుతూ.. ఈ పాటకు ముందు సన్నివేశంలో తాను టైట్ పింక్ సల్వార్ కమీజ్‌లో కనిపిస్తాననీ, ఈ డ్రెస్ అప్పట్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని చెప్పింది. ఆ ఔట్‌ఫిట్ వేసుకోవడానికి తాను సినిమా డైరెక్టర్ నాజిర్ హుస్సేన్‌తో గొడవ కూడా పడ్డానని నాటి సంగతులను గుర్తుచేసుకున్నది. ఇక బాంబేలో పుట్టి పెరిగిన జీనత్.. చిన్న వయసులోనే మోడల్‌గా కెరీర్‌ను స్టార్ట్ చేసింది. 19 ఏళ్లకే 'మిస్ ఆసియా పసిఫిక్' అవార్డును దక్కించుకున్న మొదటి భారతీయురాలిగా రికార్డు సృష్టించింది. 'హరే రామ హరే కృష్ణ'లాంటి భారీ హిట్ చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తర్వాత డాన్, యాదోంకీ బారాత్, కుర్బానీ, సత్యం శివం సుందరం, ధరం వీర్ వంటి హిట్స్‌ను తన ఖాతాలో వేసుకున్నది. అయితే, టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సమయంలోనే కెరీర్‌కు గుడ్‌బై చెప్పేసింది.

